


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 14-8-2025
సంపుటి: 21 సంచిక: 122
పేజీలు: 8 వెల: రూ.1



# హలో.. మీ కలెక్టర్ ఎలా ఉన్నారు?



- అధికారుల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా
- ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- ఇంతవరకు ఎమ్మెల్యేలు, పథకాల వరకే పరిమితం
- తాజా చర్యలతో పాలనలో జవాబుదారీతనం పెరిగే ఛాన్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**'మంగళగిరి టీడీపీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది?.. బాగుంటే 1 నొక్కండి, బాగులేకపోతే 2 నొక్కండి, చెప్పలేకపోతే 3 నొక్కండి'..**

ఈ మధ్యకాలంలో ఇటువంటి వాయిస్ కాల్స్‌ను రాష్ట్ర ప్రజలు తరచూ అందుకుంటున్నారు. ఇవి చంద్రబాబునాయుడు హైటెక్ విధానాలను ప్రతిబింబిస్తుంటాయి. పార్టీని, ప్రభుత్వాన్ని నడపడంలో ప్రజాభిప్రాయానికే ప్రాముఖ్యత ఇవ్వాలన్నది ఆయన ఉద్దేశం.. అందుకే తాను చేపట్టే ప్రతి కార్యక్రమంపై వివిధ మార్గాల్లో ప్రజాభిప్రాయం సేకరిస్తుంటారు. అందులో భాగమే ప్రస్తుతం ప్రజలకు అందుతున్న ఐవీఆర్ఎస్ కాల్స్. ఇంతవరకు అభ్యర్థుల ఎంపిక, ఎమ్మెల్యేల పనితీరు, పథకాల ప్రయోజనాలపై ప్రజల ఫీడ్‌బ్యాక్ తీసుకోవడానికే ఈ పద్ధతిని అనుసరించిన చంద్రబాబు సర్కారు తాజా అధికారుల పనితీరుపైనా ఇదే విధానంలో ప్రజాభిప్రాయం సేకరిస్తోంది.

ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చర్యలు

అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పథకాలు, ప్రజాప్రతినిధుల పనితీరుపైన.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికలకు తమ పార్టీ అభ్యర్థుల ఎంపికపైన ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం చంద్రబాబుకు తొలినుంచీ అలవాటు. దీనికోసం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్)ను వినియోగిస్తుంటారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఉన్నతాధికారుల పనితీరుపైనా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్, జేసీలతోపాటు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల కమిషనర్ల పనితీరుపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ముందుగా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్ పనితీరుపై ప్రస్తుతం ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నారు. తర్వాత దశలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారుల పనితీరు, అవినీతిపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులు, అర్జీలకు పరిష్కారం చూపించారా లేదా.. పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా అంటూ దరఖాస్తుదారుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. దాంతో గ్రీవెన్స్‌లో అందే అర్జీలకు తప్పనిసరి పరిస్థితుల్లో ఏదో ఒక పరిష్కారం చూపించాల్సిన అగత్యం అధికారులకు ఏర్పడింది. అయితే అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపించినట్టు దరఖాస్తుదారుల నుంచి సంతకాలు తీసుకొని రియల్‌టైం గవర్నెన్స్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్ ద్వారా అర్జీదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. వారి అభిప్రాయం మేరకు తదుపరి చర్యలకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు, వారి అవినీతిపైనా ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. దాని ఆధారంగా గ్రేడ్‌లు ఇవ్వడంతోపాటు అసంతృప్తి ఎదుర్కొంటున్న వారిని పిలిపించి పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు హెచ్చరించారు.

పెరగనున్న జవాబుదారీతనం

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారు. దానికి కొనసాగింపుగా అధికారుల పనితీరుపైనా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం ప్రారంభించారు. 2014-19 మధ్య ఐవీఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా వినియోగించిన చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ విధానాన్ని పున:ప్రారంభించారు. పథకాల ప్రయోజనాలు, వాటి అమలు తీరు, ప్రభుత్వ సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజలు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా రేటింగ్ ఇవ్వడంతోపాటు అవసరమైన మార్పులు చేర్పులు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇప్పటికే అన్న క్యాంటీన్లు, ఇంటింటికీ పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, క్వాంటిటీ, పరిశుభ్రత, సమయపాలనపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. పింఛను ఇంటి వద్దే అందుతుందా? లేదా?.. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? వంటి ప్రశ్నలకు లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ పథకాల అమల్లోనూ, అధికారుల పనితీరులోనూ జవాబుదారీతనం పెరిగి కచ్చితత్వం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్న ఉచిత ఇసుక విధానం, నూతన మద్యం పాలసీ అమలుతీరుపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తే వాటిలోనూ పారదర్శకత పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు. మరోవైపు అభిప్రాయాలు సేకరించడమే తప్ప వాటిని ఆచరణలో పెట్టడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఖరీఫ్ ధాన్యం సేకరణ సమయంలో ధాన్యం కొనుగోలుపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా రైతుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఆ మేరకు ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శలు ఉన్నాయి.

---

# మరీ ఇలా దొరికిపోయారేంటి చీఫ్‌గా



- ఆంధ్రాలో ఓట్‌చోరీ అంటూ రాహుల్ ఎందుకు మాట్లాడాలి?
- ఎన్నికల తర్వాత సమీక్షలో ఈవీఎంపై మాట్లాడింది మీరే కదా
- చంద్రబాబు-రాహుల్ బంధం ఎలా కుదురుతుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో అన్ని రాష్ట్రాల్లో కంటే ఏపీలోనే ఎక్కువ ఎన్నికల అక్రమాలు జరిగాయని, కానీ రాహుల్‌గాంధీ ఏపీ గురించి ఏమీ మాట్లాడటం లేదని, చంద్రబాబుతో చేతులు కలపడం వల్లనే ఏపీ ఎన్నికల అక్రమాల గురించి మాట్లాడటం లేదని జగన్ అన్నారు. ఈ మధ్య కాలంలో ఇంత పస లేని, హాస్యాస్పద, అపరిపక్వ రాజకీయ వ్యాఖ్య దేశంలోనే ఎవరూ చేసుండరు.

ఏపీ గురించి మీరు సైలెంట్‌గా వుంటే రాహుల్ అక్కడి ఎన్నికల అక్రమాల గురించి కత్తి తిప్పాలా?



అసలు నిజానికి రాహుల్ దేశం మొత్తం ఎన్నికల గురించి మాట్లాడలేదు. 2024లో వివిధ రాష్ట్రాలలో ఎదురైన ప్రతికూల ఎన్నికల ఫలితాలను దృష్టిలో వుంచుకొని గెలుస్తామని బాగా నమ్మకం వుండి ఓడిపోయిన కర్నాటకలోని ఒక్క పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒకే ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లో చోటు చేసుకున్న ఐదు రకాల ఇర్రెగ్యులారిటీస్ గురించి మాట్లాడాడు. రాహుల్ చూపించింది కేవలం ఓ ఉడికిన అన్నం మెతుకు. ఆయన ఒక్క మహదేవ్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌ని మాత్రమే కవర్ చేశాడు. ఏ మాత్రం కనీస తర్కం, మౌలిక అవగాహన లేకుండా అసలు అలా ఎలా ఏపీ గురించి ఏమీ చెప్పలేదని వ్యాఖ్యానించగలడు? అది జగన్‌కే సాధ్యం.

ఆయన పలికిన మరో ఆణిముత్యం ఏమిటంటే రాహుల్, చంద్రబాబు మధ్య ఏదో ఒప్పందం వుందన్నాడు. ఇది మరీ పీక్స్. టీడీపీ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీయే కూటమిలో వుంది. వాళ్లూ వాళ్లూ బానే వున్నారు.

ఒక రాజకీయ ప్రత్యర్థిగా ఈయనకది ఇష్టం లేకపోవడం సహజమే. తప్పేం లేదు. కానీ మోడీకి వ్యతిరేకంగా బాబు రాహుల్‌తో చేతులు కలుపుతాడని అనడం ద్వారా ప్రజల దృష్టిలో పలుచనే అవుతాడాయన. ఏమాత్రం కన్విన్సింగ్‌గా లేని వ్యాఖ్య ఇది. గతంలో మోడీని విభేదించినప్పుడు బహిరంగంగానే రాహుల్ చెంతకు చంద్రబాబు చేరిన విషయం అందరికీ తెలుసు. కాకపోతే ఇప్పుడు మోడీని కాదని బాబు అటువైపు వెళ్లలేరనేది కూడా అందరికీ అర్థమయ్యేది.

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలే చంద్రబాబుకి చివరి ఎన్నికలు కాబట్టి, ఈ శేష జీవితం కృష్ణా రామా అనుకుంటూ కూర్చోవాలని కూడా జగన్ సెలవిచ్చారు. 2029 ఎన్నికల వరకు చంద్రబాబు జీవించి వుండకూడదనే బలమైన కోరిక ఏదో మనసులో వుంటే మాత్రం అలా బైటపడితే ఎలా జగన్ గారూ? అస్సలు బాలేదు.

మామూలుగా అయితే పొలిటికల్ పార్టీస్, వాటి కేడర్స్ ఒకరినొకరు దూషించుకోవడం పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. ఎందుకంటే తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఏపీలో రాజకీయాలు తమ హుందాతనాన్ని ఎప్పుడో కోల్పోయాయి. కానీ పార్టీల అధినేతలు ఎవరైతే వున్నారో వాళ్లు బాధ్యతగా, డీసెంట్‌గా వుండాలని ఆశించడంలో తప్పులేదు.

ప్రత్యేక హోదా ఇవ్వనివాడు మోడీ అయితే ఇక్కడ మనవాళ్లు ముగ్గురు మోడీని మాట వరుసకు కూడా పేరెత్తకుండా ఒకరినొకరు దెప్పిపొడుచుకుంటారు.

**చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ మధ్య హాట్ లైన్ నడుస్తుంది. రాహుల్ గాంధీ ఏపీ లో జరిగిన వోట్ చోరీ గురించి ఎందుకు మాట్లాడడం లేదు..?**

**-వైఎస్ జగన్**



విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేయబోయింది మోడీ అయితే మళ్లీ ఇక్కడ ఆయన్నేమీ అనకుండా ముగ్గురూ ఒకరినొకరు తిట్టుకునేవారు. రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటానికీ ఆయన నిధులివ్వకపోతే వీళ్లలో వీళ్లు వీధి కుళాయి కయ్యాలాడుకుంటారు. అదే పద్ధతిలో దొంగఓట్లపై రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో ఎన్నికల కమిషన్ మీద దాన్ని నడిపించిన ప్రభుత్వంపై పోరాటం చేస్తుంటే.. ఇక్కడ మనవాళ్లు ఎప్పటిలానే బాధ్యుల్ని వదిలేసి వాళ్లను ఎత్తిచూపిన రాహుల్ గాంధీపై పడుతున్నారు. రెండు రోజులు ఆగి జగన్ కూడా మూడోరోజు ముసుగు తొలగించేసుకున్నారు. అసలు తెలుగోడు అనే పదంలోనే ఈ అవలక్షణాలు అన్నీ నిక్షిప్తమై ఉన్నాయేమో..?!

కులగజ్జి వల్ల కొంతమంది, ఆ నాయకుడు నచ్చక ఇటువైపునకు, ఈ నాయకుడు నచ్చక అటువైపునకు ఘనీభవించేసి అసలు విషయం పట్ల అపసవ్యత వైపు నిలబడిపోతున్నారు. ఎంత జుగుప్సాకరంగా, ఎదురుగా తేలిపోతున్నప్పటికీ కూడా మా వాడు కట్టుకున్నవి దేవతా వస్త్రాలు కావు, పట్టు వస్త్రాలేననే బుకాయింపొకటి.

అదేదో సినిమాలో రావు గోపాలరావు అన్నట్టు సపోజ్, పర్ సప్పోజ్ ఆంధ్రలో దొంగఓట్లు వేయించుకుని గెలిచారే చూడు. అదే నిజమనుకుందాం. అది ఎవరు చేయించి ఉండాలి? కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఎవరికోసం చేయించింది? చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి.

ఆ తప్పులో కాంగ్రెస్‌కు గాని, రాహుల్ గాంధీకి గాని ఎంత మాత్రం పాత్ర లేదుగా! దానివల్ల లబ్ధి పొందిందెవరు? చంద్రబాబు. లబ్ధి చేకూర్చింది ఎవరు.. మోడీ. జగన్ అనదల్చుకుంటే, నిజంగా ఆయన అభిమానులు ఆయన్నేదో అంటుంటారు అదంతా నిజం అయితే ఆయన ఆరోపించాల్సింది ఎవరిని? నరేంద్ర మోడీని. కానీ అంటున్నది



ఎవరిని? రాహుల్ గాంధీని. తేలిపోలేదూ? జగన్ నుంచి విజయాన్ని దొంగలించారని అంటూ ఆ దొంగ పేరు ఎత్తలేకపోతున్నారంటే, సింగిల్ సింహం, పులివెందుల పులి లాంటి భుజకీర్తులు తగిలించి మాట్లాడుతున్నారు అంటే.. అదంతా అబద్ధమని ఒప్పుకోవాలి. చంద్రబాబుతో చేరి మోడీ ఆంధ్ర రాష్ట్రంలోని ఈవీఎంలను మార్చేసి అక్క చెల్లెళ్లు, అన్నా తమ్ములు, అవ్వతాతలు ఇంకా కోట్లాదిగా నీకు వేసిన ఓట్లను దాచేసి నిన్ను అన్యాయంగా ఓడించారని, దీనంతటికీ మోడీయే కారణమని, ఎన్నికల కమిషన్‌ను ఆయన ఇలా భ్రష్టు పట్టించారని ఒక్క మాటైనా అనాలి. అలా అనటమే కాకుండా కాదనడానికి వీల్లేని సాక్ష్యాధారాలను ప్రెస్‌మీట్ పెట్టి, వివరించి చెప్పి, వాళ్లు అడిగే ప్రశ్నలను సూటిగా తిప్పికొట్టాలి. జగన్ మాటల్లో పసవుంటే అర్థం చేసుకున్న వాళ్లు అందరూ ఆయన వెనుక వచ్చి నిలబడతారు.

నిన్నటిదాకా సింగిల్ సింహం, మడమ తిప్పనితనం అంటూ కబుర్లు చెప్పి ఇప్పుడు ఎవరో రాహుల్ గాంధీ రాలేదు, నా మాట ఎత్తలేదు ఇలాంటి బేలతనపు మాటలు చెల్లవ్. మీ యుద్ధం మీరు చేసుకోండి. దానికి ఇతరుల సాయం దేనికి? అందునా మీ ప్రత్యర్థుల సాయం కోరడం ఏంటి? బొత్తిగా చిరాగ్గా ఉండటమే కాకుండా చిన్నతనంగా కూడా లేదూ? కిరణ్ కుమార్ రెడ్డి స్థాయికి దిగజారకూడదని జగన్ తెలుసుకోవాలి.

• ఎడిటోరియల్

# ఓటు హక్కును చంపేస్తున్నారు!

'బతికున్న నన్ను చంపేశారు. నా ప్రమేయం లేకుండానే.. విచారణ జరపకుండానే, ఆధారాలు అడక్కుండానే.. నన్ను చనిపోయినవాడి కింద జమ కట్టేసి నా ఓటుహక్కును హరించేశారు. కానీ నేను బతికున్నాను మొర్రో.. అని మొత్తుకుంటున్నా మళ్లీ ఓటు హక్కు కల్పించడానికి ఆ పత్రాలు, ఈ పత్రాలు కావాలంటున్నారు.. ఇదెక్కడి న్యాయం'.. ఇదీ సుప్రీంకోర్టులో ఓ వ్యక్తి ఆరోపణ, ఆవేదన. ఓటర్ల జాబితాల సవరణల పేరుతో జరుగుతున్న అవకతవకలకు ఇదో ప్రబల నిదర్శనం. చనిపోయాడని ఏకపక్షంగా తేల్చేసి ఓటర్ల జాబితా నుంచి అధికారులతో తొలగింపునకు గురైన వ్యక్తే నేరుగా కోర్టులో ప్రత్యక్షమవడం మన ఎన్నికల ప్రజాస్వామ్య వికృత నగ్నస్వరూపానికి నిదర్శనమని చెప్పక తప్పదు. ఓ వ్యక్తి నేరుగా వచ్చి నేను బతికే ఉన్నాను మహాప్రభో.. అని చెప్పినా కూడా ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది దాన్నో డ్రామాగా కొట్టిపారేయడానికి ప్రయత్నించడం.. అడ్డగోలు వాదనకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందన్న ఆరోపణలు మిన్నంటాయి. అధికార ఎన్డీయే కూటమి పార్టీలు ఈ ప్రక్రియను తమకు అనుకూలంగా మలచుకుని, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులుగా ఉన్న వారందరి పేర్లను రకరకాల కారణాలతో ఓటర్ల జాబితాల నుంచి పీకించేశారు. ఆ విధంగా సుమారు 65 లక్షల ఓట్లను రాష్ట్ర ఓటర్ల జాబితాల నుంచి తొలగించేయడంపై దాఖలైన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు విచారణ బెంచ్ ముందుకు చనిపోయారని తొలగింపునకు గురైన ఇద్దరు వ్యక్తులు స్వయంగా హాజరయ్యారు. భోజ్‌పురి జిల్లా ఆరా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 41 ఏళ్ల మింటు పాశ్వాన్ వారిలో ఒకరు. పిటిషనర్లలో ఒకరైన యోగేంద్ర యాదవ్ వారిని కోర్టుకు తీసుకొచ్చారు. పాశ్వాన్ మాట్లాడుతూ 'నా పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, నేను చనిపోయినట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించినట్లు గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నాను. నేను బతికే ఉన్నానని నిరూపించుకోవడానికి ఓ వీడియో కూడా చేశాను. ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాను. కానీ అధికారులు బ్యాంకు ఖాతా పత్రాలు, స్కూల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు వంటివి అడుగుతున్నారు. నా పేరు తొలగించేటపుడు అసలేమీ అడగలేదు. చేర్చమంటే మాత్రం సవాలక్ష అడుగుతున్నారు' అని పాశ్వాన్ వాపోయారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోయిన 65 లక్షల మందిలో పాశ్వాన్ ఒకరు. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం.. తొలగించిన 65 లక్షల ఓటర్లలో 22 లక్షల మంది చనిపోయారట! మరో 36 లక్షల మంది శాశ్వతంగా వలసపోవడమో లేదా నిర్దేశిత చిరునామాలో లేకపోవడమో జరిగిందట!! మరో ఏడు లక్షల మంది ఓటర్లకు ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓట్లున్నాయట!!!. కానీ కనీసం తన ఇంటికి రాకుండా విచారించకుండానే తనను, కేరళలో పనిచేస్తున్న తన సోదరుడిని కూడా చనిపోయినవారి జాబితాలో చేర్చేశారని.. దీనిపై ఫిర్యాదు చేసిన తర్వాతే బూత్‌స్థాయి అధికారి ఇంటికి వచ్చి చూసి వెళ్లారని పాశ్వాన్ వివరించారు. వాస్తవం కళ్ల ముందు కనిపిస్తున్నా.. ఎన్నికల సంఘం తరపున వాదించిన సీనియర్ అడ్వకేట్ రాకేష్ ద్వివేది ఇలా వ్యక్తులను కోర్టులో హాజరుపర్చటం డ్రామా అని కొట్టిపారేసే ప్రయత్నం చేశారు. ఈ విధంగా నాటకాలాడే బదులు పొరపాట్లను సరిదిద్దేందుకు సహకరిస్తే బాగుంటుందని ఆయన సూచించారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం కూడా ఇది సరిద్దుకోదగిన పొరపాటే అని వ్యాఖ్యానించింది. కాగా సామూహికంగా ఓటుహక్కు రద్దుచేసే పరిస్థితి ఉన్న సందర్భాల్లో తాము జోక్యం చేసుకుంటామని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన హామీని పిటిషనర్ యోగేంద్రయాదవ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ప్రస్తుతం బీహార్‌లో జరుగుతున్నది సామూహిక ఓట్ల రద్దు ప్రక్రియేనని.. అందు వల్ల సర్వోన్నత న్యాయస్థానం దీన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం హడావుడిగా చేపట్టిన ఈ ప్రక్రియ వల్ల చాలామంది పేదలు తమ ఓటుహక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. గతం నుంచీ ఓట్లు వేస్తూ.. ఇప్పుడు ఓటుహక్కు కోల్పోయిన వారిని మళ్లీ కొత్తగా నమోదు కావాలని అధికారులు చాలా సింపుల్‌గా సూచిస్తున్నారు. స్థానికులేనని నిర్ధారించడానికి చాలా పత్రాలు అడుగుతున్నారు. ఈ కసరత్తు తప్పుడు పద్ధతుల్లో ఎన్నికైనవారిని కాకుండా ఎన్నుకున్నవారిని తప్పుపడుతున్నట్లుగా ఉంది.

## జెడ్పీటీసీ ఎన్నికల గెలుపు కూటమి పాలనకు నిదర్శనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పులివెందుల, ఒంటి మిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ భారీ గెలుపు ముఖ్య మంత్రి నారా చంద్రబాబునా యుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అద్భుత పనితీరుకు ప్రజల ఇచ్చిన గొప్ప తీర్పు అని నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు మాటలలో తీరు మార్చుకోకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పులివెందుల కూడా పోయే పరిస్థితి వస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకం, స్త్రీ శక్తి అమలు"కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏడాది దాటిన పాలన అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో అంబరాన్ని అంటే సంబరాలు జరుపుకుంటున్నారని, దానికి నిదర్శనం గత నెల రోజుల నుంచి తెలుగుదేశం యావత్తు పార్టీశ్రేణులు, రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తిరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి రాష్ట్ర ప్రజలు అద్భుత రీతిలో అఖండ నీరాజనాలు పలికి విజయవంతం చేశారని పేర్కొన్నారు.

## ఐతమ్‌లో చేతి కళా ప్రదర్శనలు

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవం వేడుక సందర్భంగా శాఖ ఇన్‌ఛార్జ్ కె.సురేష్, వి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో చేతితో వేసిన బొమ్మలు, రంగులు దిద్దడం, చేతితో తయారు చేసిన అల్లిక బహుమానాలు, గోడ పత్రికలు వంటి వస్తువులు ఉంచారు. ఈ ప్రదర్శనలను డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావులు సందర్శించి, ఇలాంటి కళల ద్వారా విద్యార్థులలో మరింత నైపుణ్యత పెంచుకోవచ్చున్నారు. ఈ సందర్శనలో ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ డి.యుగంధర్, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ డి.శాంతికుమార్‌లు పాల్గొన్నారు.





ఇటీవల నూతనంగా పీఏసీఎస్ చైర్మన్ సభ్యులుగా జి.సిగడాం మండలం నుండి ఎన్నిక కాబడిన బెవర జగన్ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును రణస్థలం క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కుమరాపు రవికుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, జి.సిగడాం

## మురపాకను మండలంగా ప్రకటించండి

(సత్యంన్యూస్, లావేరు)

నూతన జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మురపాకను మండల కేంద్రంగా ప్రకటించాలని మురపాక మండల సాధన సమితి సభ్యులు కోరారు. ఈమేరకు శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వెలగపూడి సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్షులు బాలి శ్రీనివాసనాయుడు మురపాక మండలం ఏర్పాటు ఆవశ్యకతను క్యాబినెట్ సబ్‌కమిటీకి వివరించారు. 1989లో మురపాక మండలం ఏర్పడుతూ గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని, ప్రస్తుతం మండల కేంద్రం లావేరు, మురపాక గ్రామానికి 17 కి.మీ దూరంగా ఉండటం వలన జాతీయ రహదారి దాటుకుని వెళ్లాల్సి వస్తుందని పలు రకాల ప్రమాదాలకి గురి కావాల్సి వస్తుందని వివరించారు. 11 పంచాయతీల, 32 గ్రామాల ఆకాంక్షని ఆయా పంచాయతీల సర్పంచులు తీర్మానాల రూపంలో అందజేశారని, వాటిని సబ్‌కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లామని మురపాక మండల సాధన సమితి సభ్యులు మీసాల రమణ, పెయ్యల లక్ష్మణరావు తెలియజేశారు. త్వరలో జిల్లాల్లో పర్యటిస్తామని అప్పుడు మళ్లీ వినతులు స్వీకరిస్తామని మంత్రులు తెలియజేశారని మురపాక మండల సాధన సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మీసాల భానూజీరావు, పేరూరి గురునాథ్, నాజాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలకు దాతలు సహకారం అవసరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరం అని, తద్వారా పాఠశాల అభివృద్ధి చెందడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చునని శ్రీకాకుళం మండల విద్యాశాఖ అధికారి-2 ఎన్ కృష్ణ అన్నారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో గల 50 వ డివిజన్ సీపన్నాయుడుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలింగాంధ్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ సభ్యులు, దాత సీపాన రమేష్ కుమార్ సుమారు 20వేల రూపాయలు తన సొంత నిధులతో సమకూర్చిన మంచినీటి పైప్ లైన్లు , వాటర్ ప్యూరిఫైయర్ మిషన్ ను గురువారం మండల విద్యాశాఖ అధికారి-2 ఎన్ కృష్ణ ప్రారంభించారు. అలాగే ఆ పాఠశాలలో చదువుతున్న 16 మంది విద్యార్థులకు భోజనానికి ప్లేట్లు, మంచినీళ్లు త్రాగేందుకు గ్లాసులను విద్యార్థుల తల్లిదండ్రులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు సహకారం ఉంటే పాఠశాలల అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాత సీపాన రమేష్ కుమార్,స్థానికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ పాఠశాలను తాను దత్తత తీసుకుంటానని తెలిపారు. అనంతరం ఎంఈఓకు అసోసియేషన్ ప్రతినిధులు పుష్పగుచ్చాన్ని అందజేసి, శాలువాలతో సత్కరించారు. అలాగే దాత సీపాన రమేష్ కుమార్‌ను ఎంఈఓ కృష్ణ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సీపాన అప్పలనాయుడు, పొట్నూరు తులసీరామ్, కంచరాన కన్నారావు, పోలినాయుడు, పేడాడ శ్రీకాంత్, అప్పలనాయుడు, పొట్నూరు ప్రతాప్, సీపాన రాజేష్, ప్రకాష్, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రామరాజు, జి వెంకటరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ పైడి సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవ సరం లేదు. తన అద్భుతమైన నటనతో విలక్షణ నటుడిగా పేరు సొంతం చేసు కున్నారు. అటు బాలీవుడ్ లో సిని మాలు చేస్తూనే.. ఇటు సౌత్ హీరోల తో సత్సంబంధాలు కొనసాగిస్తూ మంచి పేరు అందుకున్నారు. ముఖ్యం గా సౌత్ హీరోల సినిమాలలో కూడా నటిస్తూ ఇటు సౌత్ ఆడియన్స్‌ని కూడా అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇక అందులో భాగంగానే తాజాగా ఆయన రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కూలీ సినిమాలో 15 నిమిషాల క్యామియో పాత్ర పోషించారు. ఇప్పటికే థియే టర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఒకవైపు సౌత్ సినిమాలలో గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తున్న అమీర్ ఖాన్.. మరొకవైపు బాలీవుడ్లో నటించిన చిత్రం 'సితారే జమీన్ పర్'. అటు ఈ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు.. ముఖ్యంగా ఈ సినిమాని ఓటీటీలోకి అందుబాటులోకి తీసుకురాకుండా యూట్యూబ్లో రెంటల్ పద్ధతిలో అందుబాటులోకి తీసుకొచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు అమీర్ ఖాన్. ఈ సినిమాతో ఇప్పటికే రూ.260 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ప్రతి సినిమాకి భయపడతాను అంటూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు అమీర్ ఖాన్.




# ప్రతీ సినిమాకు.. భయం వేస్తుంది!

తాజాగా జవాన్లతో కలిసి సితారే జమీన్ పర్ సినిమా చూసిన అమీర్ ఖాన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.." నేను ప్రతి సినిమాకు భయపడతాను. రిస్క్ ఉన్న సినిమాలను అంగీకరించడం అలవాటైపోయింది. అందుకే ప్రతి ప్రాజెక్టుకి కూడా భయం ఉంటుంది.. ఆ భయమే నన్ను మరింత కష్టపడేలా చేస్తోంది" అంటూ తెలిపారు అమీర్ ఖాన్. ప్రస్తుతం అమీర్ ఖాన్ చేసిన ఈ కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఏదేమైనా ప్రేక్షకుడిని మెప్పించి తనకంటూ ఒక గుర్తింపు సొంతం చేసుకోవాలి అంటే హీరోలు ఈ మాత్రం కష్టపడాల్సిందే అని నెటజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు.

ఇక సితారే జమీన్ పర్ మూవీ విషయానికి వస్తే.. ఏడాది జూన్ 20వ తేదీన విడుదలైన స్పోర్ట్స్ కామెడీ డ్రామా మూవీగా నిలిచింది ఈ చిత్రం. 2018లో విడుదలైన స్పానిష్ సినిమా ఛాంపియన్స్ ఆధారంగా అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై అమీర్ ఖాన్, అపర్ణ పురోహిత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అమీర్ ఖాన్ హీరోగా.. జెనీలియా హీరోయిన్ గా నటించింది. దాదాపు రూ.65 -95 కోట్ల బడ్జెట్తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.262 కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించింది.

అంతేకాదు ఈ ఏడాది అత్యధిక కలెక్షన్లు సాధించిన హిందీ మూడవ చిత్రంగా కూడా రికార్డు సృష్టించింది. అలాగే ఈ ఏడాది అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రాలలో నాలుగవ భారతీయ చిత్రంగా కూడా పేరు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సినిమాని ఆగస్టు ఒకటి నుండి హిందీ తో పాటు తెలుగులో 100 రూపాయల రెంటల్ పద్ధతిలో 'అమీర్‌ఖాన్ టాకీస్' అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...




షూటింగ్స్ బంద్

## ఇంకెంత కాలం ?

టాలీవుడ్‌లో షూటింగులు నిలిచిపోయాయి. వేతనాలు పెంచాలని గత కొద్దిరోజులుగా ఫెడరేషన్ సమ్మెకు దిగింది. ఫెడరేషన్, నిర్మాతల మధ్య చర్చలు ఓ కొలిక్కి రావడం లేదు. తాజాగా ఈ అంశంపై నిర్మాత దిల్ రాజు మాట్లాడారు. ఈ రోజు సుదీర్ఘంగా జరిగిన సమావేశం అనంతరం కొన్ని అప్‌డేట్స్ ఇచ్చారు. వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నాం. అయితే కొన్ని షరతులు ఉన్నాయని చెప్పారు. "2018, 2022లో జరిగిన అగ్రిమెంట్స్‌లో ఉన్న రెండు షరతులను వాళ్లు అమలు చేయడం లేదు. ముందు వాటిని ఒప్పుకోవాలి. వీటితో పాటు మరో రెండు షరతులు కూడా ఉన్నాయి. ఇదే విషయాన్ని ఛాంబర్ ద్వారా వాళ్ల దృష్టికి తీసుకొచ్చాం. వాటిపై చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటే, వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధమే" అన్నారు. ప్రస్తుతం సానుకూల ధోరణిలో చర్చలు జరుగుతున్నాయని దిల్ రాజు చెప్పినప్పటికీ, సమ్మె విరమణ అంశంపై ఇంకా క్లారిటీ రాలేదు. మరో రెండు, మూడు సార్లు చర్చలు జరగాల్సి ఉందని దిల్ రాజు చెబుతున్నారు. తమ విధానాలకు అంగీకరిస్తే వేతనాలు పెంపు అన్నట్లుగా స్పష్టం చేశారు దిల్ రాజు. అయితే మొదటి నుంచి ఈ పాయింట్ దగ్గరే ఫెడరేషన్, నిర్మాతల మధ్య సంధి కుదరడం లేదు. మరి ఈ సమ్మె ఇంకెంత కాలం కొనసాగుతుందనేది ప్రస్తుతానికి ప్రశ్నార్ధకం.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

తెలుగు చలనచిత్ర పరిశ్రమ



## స్వాతంత్ర్య సమరయోధుల క్షేత్రం

# గాంధీ మందిరం..!

◆ భావితరాలకు దేశభక్తి నింపే పవిత్ర ఆలయం

◆ సమరయోధుల త్యాగాలు ప్రతిబింబించే నిలయం

**కరెన్సీ నోటు మీద.. నడిరోడ్డు మీద మనం చూసే బొమ్మ కాదు గాంధీజీ..! భరతమాత తలరాతను మార్చిన విధాత గాంధీజీ.. అందుకే ప్రపంచం యావత్తూ స్వాతంత్ర్య ఫలాలు పొందేందుకు, వర్ణ వివక్షత నుంచి విముక్తి సాధించేందుకు పోరాడిన యోధులందరూ బాపూ బాటనే ఎంచుకున్నారు. ఆలోచన, ఆచరణ, కార్యాచరణ ఏకం చేసి నమ్మిన సిద్ధాంతం కోసం.. లక్ష్యసాధన కోసం తన జీవితాన్నే ప్రయోగశాలగా మార్చుకున్న గాంధీజి నేటికి మహాత్ముడిగా కీర్తించబడుతున్నారు. అందుకేనేమో శ్రీకాకుళం నగరంలో ఆ మహనీయునికి ఒక గుడిని నిర్మించారు. నిత్యం రఘుపతి రాఘవ రాజారాం, పతితపావన సీతారాం అంటూ కీర్తిస్తున్నారు.**





**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

దేశంలో ఎక్కడా లేని విధంగాశ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో గాంధీ స్మారక నిధి బృందం పర్యవేక్షణలో గాంధీ గుడి, స్వాతంత్ర్య సమర యోధుల స్మృతివనం రూపుదిద్దుకుంది. పలువురు సామాజిక కార్యకర్తలు ఏకమై గాంధీ గుడి నిర్మాణానికి పూనుకోవడంతో అటు సమాజంలో దాతలు, ఇటు అధికార యంత్రాంగం తోడ్పాటును అందించి అరుదైన, ఘనమైన కీర్తి పొందేలా కార్యాన్ని సఫలీకృతం చేశారు. 2021 జనవరి 30న గాంధీ గుడిని ప్రారంభించారు. అదే ప్రాంగణంలో స్వాతంత్ర్య పోరాటంలో త్యాగాలు చేసిన సమరయోధులతో పాటు ప్రపంచానికి ప్రభావితం చేసిన సంఘ సంస్కర్తల ప్రతిరూపాలను ప్రతిష్ఠించారు. ఈ క్రమంలో గాంధీ గుడి స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతి వనం భావితరాలకు దేశభక్తిని, సమరయోధుల త్యాగాలను తెలియజేసే అపురూపమైన ప్రాంతంగా వెలుగొందింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మువ్వన్నెల జెండా సగర్వంగా ఎగరాలని, అందుకే గాంధీ గుడి నిర్మాణంలో అందించిన స్ఫూర్తితో జాతీయ జెండాను ఆ ప్రాంతంలోనే ప్రతిష్ఠించేందుకు కమిటీ చేసిన ప్రయత్నానికి దాతలు, జిల్లా యంత్రాంగం సహకరించారు.

**ప్రతి అడుగు స్వాతంత్ర్య స్ఫూర్తి...**

స్మృతి వనంలో అడుగు పెడితే ఒక వైపు గాంధీ గుడి. ధ్యాన ముద్రలో ఉన్న మహాత్ముడు గర్భగుడిలో దర్శనమిస్తారు. గుడి పైభాగంలో భరతమాతతో పాటు 15 అడుగుల గాంధీజీ ప్రతిరూపం దర్శనమిస్తుంది. గుడి మూల స్తంభాలపై హిందు, ముస్లిం, క్రిస్టియన్ మత చిహ్నాలు గోచరిస్తాయి. గుడి నలువైపులా గాంధీజీ జీవితంలో జరిగిన ముఖ్య ఘటనల చిత్రాలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని కలిగిస్తాయి. మరోవైపు 105 అడుగుల ఎత్తులో రెపరెపలాడుతూ ఉన్న జాతీయ జెండా ప్రతిఒక్కరి మదిలో దేశభక్తిని రెట్టింపు చేస్తుంది. ఇక అక్కడ కొలువుదీరిన మహనీయులు విగ్రహాలు, వారి చరిత్ర చదువుతూ ఉంటే ఇంతమంది త్యాగాల ఫలమే ఈనాటి స్వాతంత్ర్యమనే జిజ్ఞాస ప్రతిఒక్కరిలో చెరగని ముద్ర వేస్తుంది. జిల్లాకు చెందిన పలువురు పేరొందిన స్వాతంత్ర్య సమర యోధులతో పాటు ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఎందరో మహనీయుల విగ్రహాలు అక్కడ ప్రతిష్ఠించి వారి జయంతి వేడుకలను క్రమం తప్పకుండా కమిటీ నిర్వహిస్తోంది. ప్రతి పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు తప్పనిసరిగా ఇంతటి పవిత్రమైన ప్రదేశాన్ని సందర్శించి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని, త్యాగధనుల కీర్తిని ఆకళింపు చేసుకొనేందుకు చక్కని వేదిక. స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీకాకుళం జిల్లా ఎంతో కీలకమైన పాత్ర పోషించిన క్రమంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ జిల్లాలోనే గాంధీ గుడి, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంతో పాటు జాతీయ జెండా 105 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించుకోవడం అరుదైన, చారిత్రాత్మకమైన విశేషం. ఈ చారిత్రక ప్రదేశాన్ని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులతో పాటు ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నిత్యం సందర్శిస్తూ స్ఫూర్తిని పొందుతుండడం గొప్ప విషయం.




**సమర యోధులు..**
**సంఘ సంస్కర్తల నిలయం..**

గాంధీ గుడి ఆవరణలో స్వాతంత్ర్యోద్యమంలో పోరాడిన మహనీయులతో పాటు సంఘ సంస్కర్తలు కూడా కొలువుదీరారు. మందిరం గర్భగుడిలో పూజ్య బాపూజీ ధ్యానముద్రలో కొలువుదీరగా, ఇక ఆ ప్రాంతంలో గాంధీజీ రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే, బాపూజీ సతీమణి కస్తూరిబా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్, దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని పిలుపునిచ్చిన గురజాడ అప్పారావు, హైందవ ధర్మాన్ని ప్రతిష్ఠించేందుకు పోరాడిన ఛత్రపతి శివాజీ, ఆజాద్ హిందు ఫౌజ్ దళపతి నేతాజీ సుభాష్ చంద్రబోస్, ప్రపంచానికి భారత దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన స్వామి వివేకానంద విగ్రహాలు ఆకర్షిస్తాయి. మరోవైపు మానవత్వపు విలువలకు ప్రతిరూపంగా నిలిచిన మదర్ థెరిసా, శాంతిని ప్రబోధించిన గౌతమబుద్ధుడు, యువతకు స్ఫూర్తి, స్వాతంత్ర్యపు కెరటం భగత్ సింగ్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు ఇక్కడ కొలువుదీరడం విశేషం. స్వాతంత్ర్య ఉద్యమంలో మన ప్రాంతం నుంచి చురుగ్గా పనిచేసి స్వాతంత్ర్యం అనంతరం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తొలి ఎంపీగా పనిచేసిన కందాళ సుబ్రహ్మణ్య తిలక్, సర్దార్ బిరుదాంకితులు గౌతు లచ్చన్న, నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన చౌదరి సత్యనారాయణ, మాకొద్దీ తెల్లదొరతనమంటూ ఎలుగెత్తి చాటిన గరిమెళ్ల సత్యనారాయణ, స్వరాజ్య పోరాటంలో చురుగ్గా పనిచేసిన త్రిపురాన రాఘవదాస్, తెల్లదొరలపై యుద్ధం చేసిన ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరుల ప్రతిరూపాలు అక్కడ ఉండడం గొప్పవిశేషం. స్వరాజ్యం నా జన్మ హక్కు అని నినదించిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్, తన గుండెను బ్రిటిష్ తుపాకులకు ఎదురుగా నిలిపిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, దేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్, భారతరత్న బిరుదాంకితులు, ప్రపంచం గర్వించే ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, పీపుల్స్ ప్రెసిడెంట్, మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం, కులమతాల సుడిగుండాల నుంచి బయటపడి జీవితాంతం పోరాడిన జ్యోతీరావుఫూలే, సావిత్రీబాయి పూలే దంపతులు, జాతీయ గీతం జనగణ మన రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్, జైజవాన్, జైకిసాన్ అంటూ నినదించిన లాల్ బహుదూర్ శాస్త్రి, తెలుగు వ్యవహారిక భాషా పితామహులు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, రైతు బాంధవుడు ఆచార్య ఎన్.జి.రంగా, దక్షిణాది గాంధీగా పేరొందిన పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయులు గాంధీ గుడి ప్రాంగణంలో నిత్య స్మరణీయులుగా వెలుగొందుతున్నారు. ఇక వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ, మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య ప్రతిరూపాలను 105 అడుగుల జాతీయ జెండా సమీపంలో నెలకొల్పి త్యాగధనుల కీర్తిని శాశ్వతం చేశారు. ఎంతో అరుదైన, పవిత్రమైన, చారిత్రకమైన ఈ ప్రదేశం స్వాతంత్ర్య సమరయోధుల పుణ్యక్షేత్రంగా భావితరాలకు స్ఫూర్తినిచ్చే నిలయంగా పేరుగాంచింది. శ్రీకాకుళం నగరం శాంతినగర్ కాలనీ ప్రాంతంలో ఏర్పాటైన గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం జీవితంలో ఒకసారైనా సందర్శించాల్సిందే.

---

## సాక్షి ఫోటో జర్నలిస్ట్ జయశంకర్‌కి

# జాతీయస్థాయి అవార్డు



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్టు కుప్పిలి జయశంకర్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్, ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో ఈయనకు ఈ అవార్డు వరించింది. ఈ నెల 18న విజయవాడలో అవార్డును జయశంకర్ అందుకోనున్నారు.



## ఫోటోగ్రాఫర్ సింహాచలంకు అవార్డు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ పీజేఏ) నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో బెస్ట్ సర్టిఫికేట్ ఆఫ్ మెరిట్ అవార్డుకు పి.సింహాచలం ఎంపికయ్యారు. ఇటీవల అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణలోని ఆదిలాబాద్‌లో ఈనాడు ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన పి.సింహాచలంకు ఈ అవార్డును ప్రకటించారు. మొత్తం 28 మంది ఫోటోగ్రాఫర్లకు అవార్డులు, మరో 22 మందికి మెరిట్ సర్టిఫికెట్లను ఈ నెల 19న విజయవాడలో అందజేస్తామని ఏపీపీజేఏ అధ్యక్షుడు సిహెచ్ వి.ఎస్.విజయ భాస్కరరావు తెలిపారు. మెరిట్ అవార్డుకు ఎంపికకావడంపట్ల జిల్లా మీడియా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఇదివరకే అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఉత్తమ ఫోటో గ్రాఫర్‌గా అవార్డులు అందుకున్న సింహాచలం రానున్న రోజుల్లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని మీడియా జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు ఆకాంక్ష వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

---

## ఆవుకు ఒకే కాన్పులో రెండు దూడలు



### ఆనందంలో రైతు చోడిముడి కృష్ణారావు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పెద్దపాడు రామాలయం వీధికి చెందిన రైతు చోడిముడి కృష్ణారావుకు చెందిన ఆవుకు గురువారం ఒకే కాన్పులో రెండు దూడలు జన్మించాయి. ఇదొక అరుదైన సంఘటన అని, ఒక ఆడ, మగ దూడలకు జన్మనిచ్చిందని, రెండు దూడలు, తల్లి గోమాత ఆరోగ్యంతో ఉన్నాయని కృష్ణారావు ఆనందం వ్యక్తం చేశారు. గోవు విశ్వమాత అని, ఆవును ఆరాధిస్తే సమస్త దేవతలనీ ఆరాధించినట్లేనని అన్నారు. గోవు ప్రతి అణువులోనూ ఒక్కో దేవత ఉంటారు కాబట్టి భారతీయులకు పరమ పవిత్రమైన గోవు భారతీయుల జీవనసరళిలో మాతృదేవత తర్వాత విశిష్టమైన ద్వితీయ స్థానాన్ని వహించిందన్నారు. గోవులకు ఆహారం పెడితే సమస్త దేవతలకు ఆహారం పెట్టినంత పుణ్యఫలం కలుగుతుందని, గోమాతను నమస్కరించి ప్రదక్షణం చేస్తే భూమండలమంతా ప్రదక్షణం చేసినంత ఫలం కలుగుతుందన్నారు.



## ఒంటిమిట్ట, పులివెందులలో

# టీడీపీ ఘన విజయం..!



**కడప:** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైకాపాకు ఘోర పరాభవం ఎదురైంది. ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఘన విజయం సాధించారు. ఆమె 6,035 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైకాపా అభ్యర్థి హేమంత్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. వైకాపాకు 683 ఓట్లు లభించాయి. స్వతంత్ర అభ్యర్థులు, కాంగ్రెస్‌కు 100 లోపు ఓట్లు లభించాయి. ఈ స్థానానికి టీడీపీ, వైకాపా, కాంగ్రెస్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి 11 మంది పోటీపడ్డారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో 74 శాతం ఓటింగ్ నమోదైంది. టీడీపీ అభ్యర్థిని మంత్రి సవిత అభినందించారు. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందే పులివెందులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందుల కోటను బద్దలుకొడతామన్నారు. విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

**ఒంటిమిట్టలో టీడీపీ విజయం**

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి విజయం సాధించారు. ఈ ఉప ఎన్నికలో ముద్దు కృష్ణారెడ్డికి 12,780ఓట్లు రాగా, వైకాపా అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి 6,513 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6,267 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.




Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739



# నేటి శ్రీకాకుళం..

# ఒకనాడు సికకోలి గడ!

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

- సీకౌలమ్ కోట అనే పేరు కూడా ఉండేదట
- 335 ఏళ్లనాటి శిలాశాసనం ద్వారా వెల్లడి
- నగరంలోని ఉమాలక్ష్మేశ్వరస్వామి ఆలయంలో దాని గుర్తింపు
- ఆ తర్వాతే చిక్కాకోల్ అనే పేరు వచ్చిందని నిర్ధారణ
- జిల్లా వజ్రోత్సవాల వేళ కొత్త విశేషం

నాటి కళింగాంధ్రలో.. నేటి ఉత్తరాంధ్రలో ముఖ్యమైన ప్రాంతం శ్రీకాకుళం జిల్లా. శ్రీకాకుళం నగరం పేరుతోనే ఈ జిల్లా ఏర్పాటైంది. అయితే శ్రీకాకుళం అనే పేరు ఎలా వచ్చిందన్నదానిపై ఇప్పటివరకు ఒక కథ ప్రచారంలో ఉంది. గోల్కొండ నవాబుల పాలనలో ఉన్నప్పుడు ఏడురోడ్ల జంక్షన్ సమీపంలోని నాగావళి తీరంలో వ్యాపారుల నుంచి కప్పం వసూలు చేసేవారు. కప్పం కట్టడానికి వ్యాపారులు తమ చిక్కాలను తెరిచి డబ్బులు చెల్లించేవారు. ఆ చిక్కాలను తెరవమని చెప్పడానికి ముస్లిం సైనికులు చిక్కాకోల్ అనేవారు. అలా కాలక్రమంలో ఈ ప్రాంతానికి చిక్కాకోల్‌గా, ఆ తర్వాత చిక్కోలుగా.. సిక్కోలుగా.. శ్రీకాకుళంగా మారిందంటారు. కానీ శ్రీకాకుళానికి మరో ప్రాచీన నామం ఉన్న విషయం తాజాగా వెల్లడైంది. గోల్కొండ నవాబుల పాలనకు చాలా కాలం ముందునుంచి శ్రీకాకుళానికి సికకోలి గడ లేదా సీకౌలమ్ కోట అనే పేర్లు ఉండేవని ప్రముఖ శాసన శాస్త్రవేత్త (శిలా శాసనాల అధ్యయన నిపుణుడు లేదా ఎపిగ్రాఫిస్ట్) పర్లాకిమిడికి చెందిన బిష్ణుమోహన్ అధికారి ఇటీవల గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా 75 ఏళ్ల ఉత్సవాలు జరుపుకొంటున్న తరుణంలో జిల్లా కేంద్రానికి సంబంధించి కొత్త అంశాలు వెలుగులోకి రావడం ముదావహం.

### ఎక్కడ బయటపడిందంటే?

ఇంతకాలం మనముందునే ఉన్న ఈ చారిత్రక ఆధారాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. నగరంలోని ఒక ఆలయంలోనే శ్రీకాకుళం పురాతన నామానికి



తెలియజెప్పే శాసనం లభించడం విశేషం. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాచీన ఆలయాలు, చారిత్రక కట్టడాల్లో లభించిన 200కుపైగా రాతి, చెక్క, లోహ శాసనాలను అధ్యయనం చేసి చరిత్రకు సంబంధించి అనేక కొత్త విషయాలను ప్రపంచానికి తెలియజేసిన అనుభవజ్ఞుడు బిష్ణుమోహన్. కొద్దిరోజుల క్రితం శ్రీకాకుళం గుజరాతీపేటలో ఉన్న ఉమా లక్ష్మేశ్వర స్వామి ఆలయాన్ని బిష్ణుమోహన్ సందర్శించారు. ఆ సందర్భంగా ఆలయంలోని గర్భగుడి ముందున్న రాతి స్తంభంపై నిక్షిప్తమై ఉన్న ఒక శిలా శాసనం అతని దృష్టిని ఆకర్షించింది. దగ్గరికి వెళ్లి చూడగా ఒడియా భాషలో 65 పంక్తులతో ఏదో సమాచారం కనిపించింది. ఒడియా తెలిసిన బిష్ణుమోహన్ దాన్ని చదివి ఆశ్చర్యపోయారు. శ్రీకాకుళం పూర్వనామం సికకోలి గడ లేదా  సీ కౌలమ్ కోటగా పేర్కొన్నట్లు గుర్తించారు. ఈ శాసనం క్రీ.శ. 1690 ఏప్రిల్‌లో అంటే 335 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు అందులో ఉంది. అయితే ఆ పేరు ఎలా వచ్చిందని గానీ.. దానికి అర్థం గానీ.. ఆ శాసనంలో ప్రస్తావించలేదు. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లాలో 20కిపైగా శాసనాలను అధ్యయనం చేసిన బిష్ణుమోహన్.. శ్రీకాకుళం పేరుకు సంబంధించి లభించిన తొలి స్పష్టమైన ఆధారం, శిలా శాసనం ఇదేనని పేర్కొన్నారు. శాసనాన్ని చదవడం, ఎస్టాంపేజ్ (నకలు ప్రతులు) తయారు చేసే ప్రక్రియలో బిష్ణుతో పాటు అరవింద్ సింగ్, జగ్గు బాయ్, చక్రవర్తిరావు పాల్గొన్నారు. వారి ద్వారా శిలా శాసనం గురించి తెలుసుకున్న ఆలయ అర్చకులు ఆశ్చర్యానందాలు వ్యక్తం చేశారు. శాసనం ఇక్కడే ఉన్నా.. ఇంతకాలం తాము గుర్తించలేకపోయామని వ్యాఖ్యానించారు.

### కళింగాంధ్ర వారసత్వం

మూడు శతాబ్దాల క్రితం శ్రీకాకుళం జిల్లాకే చెందిన ఒక కీలక పరిణామాన్ని కూడా ఇదే శాసనంలో ప్రస్తావించారు. మహారాజా ప్రతాప బిశ్వంభర దేవ (సూర్యవంశీ శంకర వంశం, నందాపురం) చికాకోలును పాలిస్తున్న ముస్లిం పాలకులను ఓడించి వారితో  ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం నందిగాం, బొంతలకోడూరు, నరసన్నపేట.. మూడు గ్రామాల



ఆదాయాన్ని ఉమా లక్ష్మేశ్వరస్వామి ఆలయానికి కేటాయించడంతోపాటు బంగారం, ఆవులు కూడా విరాళంగా ఇచ్చారు. ఈ ఆదాయంతో ఆలయ



నిర్వహణ, పూజాదికాలు నిర్వహించాలని.. అర్చకులకు జీవితాంతం హక్కు కల్పించారు. శాసనంలోని తొలి 20 పంక్తులు మాత్రమే ఇటీవల ప్రచురించిన 'రెలిక్స్ ఆఫ్ కళింగ' పుస్తకంలో  బిష్ణు సహకారంతో రచయిత దీపక్‌కుమార్‌నాయక్ పొందుపరిచారు.  ఆ తర్వాత ఎస్టాంపేజ్ చేసి మొత్తం 65 పంక్తులను చదివడం గలగడం ద్వారా శ్రీకాకుళాన్ని గొప్ప కలింగ వారసత్వంతో అనుసంధానిస్తున్నట్లు అర్థమవుతుంది. ఇదే విషయాన్ని బిష్ణు మోహన్ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వివరించారు. ఈ కృషిని ప్రశంసించిన ఎమ్మెల్యే భవిష్యత్తులో ఇటువంటి పరిశోధనలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ శిలా శాసనంపై పూర్తిస్థాయిలో పరిశోధించి మరిన్ని వివరాలు అందిస్తానని బిష్ణుమోహన్ చెప్పారు. ఈ శాసనాల అధ్యయన కార్యక్రమంలో ఇన్‌ఫ్లూయెన్సర్, సిక్కోలు సోషల్ మీడియా సెక్రటరీ, శీకాకుళం వెదర్ మ్యాన్ రాజా అరవింద్‌సింగ్, జగ్గుభాయ్ కూడా పాల్గొన్నారు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ఈ ఆవిష్కరణ ఉత్తరాంధ్ర చరిత్రను పునర్నిర్వచించే అవకాశం ఉంది.

---

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొద్దూరు విద్యార్థులు వీసీఎస్ క్లబ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా విద్యార్థులు భారతదేశ పటం ఆకారంలో కూర్చొని నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను తమ ఇళ్లపై ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అదపాక దామోదర్‌రావు జెండా గొప్పతనాన్ని, మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య రూపొందించి అందించడం ప్రతి ఒక్క ఆంధ్రుడు గర్వించవలసిన విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం ,సత్యనారాయణ కృష్ణ, ప్రసాద్, భవాని మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర అమలు చేయాలి

(సత్యంన్యూస్, కొత్తూరు)

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్లుకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు బి.సురేష్, సిహెచ్. రామారావు, తవుడు, సిఐటియు నాయకులు పల్ల క్రిష్ణ డిమాండ్ చేశారు. కొత్తూరు మండల కేంద్రంలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, మాక్సీ, క్యాబ్, డ్రైవర్లకు వాహనమిత్ర పథకం క్రింద రూ.15వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. టో డ్రైవర్లు అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాదబీమా వర్తింపు చేయాలని, ఆటో డ్రైవర్లకు నష్టదాయకమైన జీఓ 21 రద్దుచేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరు అంబేద్కర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం కొత్తూరు మండల తహశీల్దార్ బాలక్రిష్ణకు వినతి పత్రం అందజేశారు.



## పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జేమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అరసవల్లిరోడ్డులోగల డాక్టర్ ఐ.మోహనరావు క్లినిక్‌లో, అరసవల్లి పరిసర ప్రాంత పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ వైద్యులు ఎస్.హారిక మాట్లాడుతూ ఎదుగుతున్న పిల్లలకు, బలమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని, వీలైనంత వరకు చిరుతిళ్ళకు, చరవాణిలకు దూరం పెట్టాలన్నారు. బయట దొరికే చిరుతిళ్ళకు అలవాటుపడితే, బలమైన ఆహారానికి దూరమౌతారని, అది పిల్లల ఎదుగుదలకు, ఉత్సహంగా ఉండటానికి ఆటంకం కలిగిస్తాయన్నారు. డా.ఐ.మోహనరావు పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం పరితపిస్తారని, ఈ రోజు పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించటం బాధ్యత అన్నారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకున్నారన్నారు,  పిల్లలకు వైద్య పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంజరాపు మోహన్, మదర్ అండ్ చైల్డ్ ఎగ్జిక్యూటివ్ వి. లక్ష్మణరావు, ఇంజరపు క్లినిక్ సహాయక సిబ్బంది, జెమ్స్ వైద్యశాల సిబ్బంది, స్థానిక పిల్లలు, తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు పరేడ్ ఘనంగా నిర్వహించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పోలీసు పరేడ్ సమష్టిగా, సమన్వయంతో నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీస్ సాయుధ బలగాలకు సూచించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఆర్ట్స్ కళాశాల మైదానంలో  గురువారం ఏ.ఆర్ డిఎస్పీ శేషాద్రి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు సాధన నిర్వహించగా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది, పోలిసు బ్యాండ్ సిబ్బంది చేసిన పరేడ్ సాధన కార్యక్రమాన్ని పరిశీలించారు. శుక్రవారం సాయుధ పోలీసు బలగాలు ఘనంగా పరేడ్ నిర్వహించి, ప్రత్యేక ఆకర్షణగా నిలవాలన్నారు. మైదానంలో వీఐపీల వాహనాల, ఇతర వాహనాలు పార్కింగ్, ట్రాఫిక్, భద్రత బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ పరిశీనలలో జేసీ ఫర్మాన్ అహమ్మద్‌తో ఎఎస్పీ కేవీ రమణ, డిఎస్పీలు సీహెచ్ వివేకానంద శేషాద్రి, సీఐ ఈశ్వరరావు, ఆర్ఐ కె.నర్సింగరావు, శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






ప్రముఖ సినీనటులు జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటించిన వార్-2 విడుదల సందర్భంగా జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి థియేటర్‌లో కేక్ కట్ చేశారు. అదే విధంగా థియేటర్ ఆవరణలో బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, శ్రీకాకుళం జిల్లా కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ అధ్యక్షులు స్టేట్ వైడ్ కన్వీనర్ బుర్రి మధు, థియేటర్ మేనేజర్ చిన్నరాజు, ఎన్టీఆర్ అభిమానులు విజయ్, యు.గంగరాజు, వై.ప్రసాద్, మళ్ళి, డి.ప్రసాద్, తమ్మినేని భాస్కర్, సూరిసెట్టి ఈశ్వరరావు, ఇంటి శంకర్, అంధవరపు శ్రీనివాసరావు, ముద్ద మదు, జి.గుప్తా, టీం తారక్ ట్రస్టు సభ్యులు వాసుపల్లి  నరసింహమూర్తి, మొఖర  షణ్ముఖ, ఎస్.నేతాజీ, వెంకీ, అయ్యప్ప, సాయి, నందమూరి అభిమానులు పాల్గొన్నారు

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పి.జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఉద్యోగుల సమస్యల గురించి చర్చ జరుపుకునే విధంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కే.ఆర్.సూర్యనారాయణ ప్రవేశపెట్టిన 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం ఏపీజీఈఏ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు శిమ్మ సోమేశ్వరరావు, కార్యదర్శి సంతోష్‌కుమార్ సూచన మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ జె.చంద్రశేఖర్, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులు, శ్రీకాకుళం పట్టణ యూనిట్, జాయింట్ సెక్రటరీ కె.భానుమూర్తి దేవ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రణవి డిగ్రీ కళాశాలకు ఎన్‌సిసి సబ్ యూనిట్ మంజూరు




(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి దరి ఇజ్జవరం గ్రామంలో ఉన్న ప్రణవి కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు ఎన్‌సీసీ సబ్ యూనిట్ మంజూరు చేస్తూ 14 ఆంధ్ర బెటాలియన్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని పేడాడ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. ప్రణవి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ఎన్‌సీసీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్ ఇతర సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం, జలుమూరు, నరసన్నపేట, మెళియాపుట్టి, పాతపట్నం ప్రాంతాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు జిల్లావ్యాప్తంగా ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రణవి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన మహిళ, పురుష విద్యార్థులు ఇందుకు అర్హులవుతారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 2వ తేదీలోగా ప్రణవి డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు మెడిసిన్, ఇంజనీరింగ్, లా, బి.ఈడి వంటి ఉన్నత విద్యలతోపాటు అన్ని ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ వంటి డిఫెన్స్ ఉద్యోగాల్లో, యూపీఎస్సీ ద్వారా నిర్వహించే డిఫెన్స్ అధికారుల ఎంపికలో ఏ విధమైన రాత పరీక్ష లేకుండా నేరుగా ఫిజికల్ టెస్టులో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఎన్‌సీసీ సబ్ యూనిట్ మంజూరు చేసిన 14వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ పెర్మనెంట్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.రమణయ్య, బేక్యాడ్ అడ్మినిస్ట్రేటర్ కే.అప్పారావు, ఎన్‌సీసీ అసోసియేట్ అధికారులు కే.రుక్మంగధరరావు, కే.మంజుల, కళాశాల సిబ్బంది ఎం.కృష్ణారావు, వి.భోగస్వామి, ఆర్.రామారావు, కె.వెంకటరావు, ఎస్.రమేష్, జి.కుమారి, హెచ్.స్రవంతి, ఎం.అప్పన్న, పీ.వీ.ఎస్.సరోజిని, ఆర్.సునీల్ కుమార్, కే.ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.